సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం ౹ 29 ౹ మార్చి ౹ 2023



కొబ్బరికి తెల్లదోమ పోటు

కొబ్బరి తోటలకు తెల్లదోమ ఆశించి రైతులు అవస్థలు పడుతున్నారు. తెగులు నివారణకు ఉద్యాన శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

8లో ▸



అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలోని పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం తల భాగాన్ని దుండగులు ధ్వంసం చేశారు.

8లో ▸

శ్రీరామనవమికి ఏర్పాట్లు



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలోని చెరువు వీధిలో శ్రీరామనవమి వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాణీ చిన్నయమ్మారావు సదనం వద్ద ఈనెల 30న కల్యాణ్యాన్ని నిర్వహించనున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం సాయంత్రం	సహరి గురువారం వేకువజాము
భీమవరం	6.24	4.41
తాడేపల్లిగూడెం	6.25	4.48
నరసాపురం	6.22	4.38

న్యూస్‌రీల్

'ఓపెన్' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు : డీఆర్వో



పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న డీఆర్వో

సాక్షి, భీమవరం: జిల్లాలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.కృష్ణవేణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూడాలన్నారు. వచ్చేనెల 3 నుంచి 17 వరకు పరీక్షలు జరుగుతాయని, సీసీ టీవీల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరంతో పాటు తాగునీటి సౌకర్యాం కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియెట్‌కు 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా 2,135 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. 9 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 111 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పరీక్షలకు 846 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 5 కేంద్రాలు, 4 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు

సాక్షి, భీమవరం: జిల్లాలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరాలను వివిధ క్రీడాంశాల్లో నిర్వహించనున్నట్టు క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ఎండీ మెహర్‌రాజు, చీఫ్‌కోచ్ పి.సురేంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 50 క్రీడా శిబిరాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిబిరాలు నిర్వహించడానికి ఆసక్తిగల క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ 99082 67811లో సంప్రదించాలని కోరారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో విజేతలు, శిక్షకులకు నగదు పురస్కారాలు అందిస్తామని, వీటి కోసం వచ్చేనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వసతి గృహ తనిఖీ



పరిశీలిస్తున్న జడ్జి మంగతాయారు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.మంగతాయారు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌ను ఆమె పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. మెనూ బోర్డును పరిశీలించి అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

97 శాతం విద్యార్థుల హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మంగళవారం ఇంటర్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 34,303 మంది విద్యార్థులకు 33,752 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 15,754 మంది జనరల్ విద్యార్థులకు 15,176 మంది, 1,073 మంది ఒకేషనల్ విద్యార్థులకు 916 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 11,452 మంది జనరల్ విద్యార్థులకు 10,929 మంది, 1,179 మంది ఒకేషనల్ విద్యార్థులకు 879 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 4,113 మంది జనరల్, 435 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 97 శాతం హాజరు నమోదైంది. పాలకొల్లు బాలి కల జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న శ్రీ చైతన్య కళాశాల (పాలకొల్లు) విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డాడని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు.

జనసేన జేపీ దాదాగిరి

- ప్రశ్నించే పార్టీ పేరుతో ఆగడాలు
- తణుకులో వ్యక్తిపై దాడి.. కిడ్నాప్‌నకు యత్నం
- వీరవాసరం జెడ్పీటీసీ జయప్రకాష్‌నాయుడు అరెస్ట్
- ఆది నుంచి వివాదాస్పద తీరు
- తొమ్మిదేళ్లలో 9 కేసులు
- నకిలీ బ్యాంకు గ్యారెంటీ వ్యవహారం తెలంగాణలో విచారణ
- జనసేన శ్రేణుల్లో కలకలం



అరెస్ట్ అయిన జెడ్పీటీసీ జయప్రకాష్‌నాయుడు, అనుచరులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజా సమస్యలపైనే మాట్లాడతాం.. ప్రజల పక్షాన నిలిచి పోరాడతాం.. ప్రశ్నించే పార్టీ మాది.. ప్రజల కోసం పనిచేసేది మేమే అంటూ జనసేన నేతలు రోజూ హడావుడి చేస్తుంటారు. అలాంటి జనసేన జిల్లా ముఖ్యనేత ప్రశ్నిస్తాను.. నిలదీస్తానంటూ పగటిపూట హంగామా చేస్తూ రాత్రిళ్లు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారు. అంతటితో ఆగకుండా కిడ్నాప్ యత్నాలు కూడా తన గ్యాంగ్‌తో కలిసి చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన నేత, వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు జయప్రకాష్‌నాయుడు (జేపీ) తీరు వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా తణుకులో భూ వివాదానికి సంబంధించి ఓ వ్యక్తిపై దాడి, కిడ్నాప్ యత్నానికి పాల్పడిన ఘటనలో పోలీసులు అతడితో పాటు, 8 మంది అనుచరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అలాగే గతంలోనూ అతడిపై పలు కేసులు ఉన్నాయి.

తీవ్ర చర్చనీయాంశంగా..

జిల్లా జనసేన పార్టీలో జయప్రకాష్‌నాయుడు తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీకి సంబంధించి జిల్లాలో ఉన్న ఏకైక జెడ్పీటీసీ (ప్రజాప్రతినిధి) కావడంతో పార్టీలో ప్రాధాన్యత ఉంది. భీమవరం జనసేనలో జయప్రకాష్ క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటారు. అనుచరగణంతో విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ ర్యాలీలు చేస్తూ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇదంతా ఒక కోణం. మరో కోణంలో దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం, కొందరు బ్యాంకర్ల సహకారంతో నకిలీ బ్యాంకు ష్యూరిటీలు సృష్టించి పొరుగు రాష్ట్రాలను బురిడీ కొట్టించేలా టెండర్లు వేయడం, తీరా విచారణకు ఆదేశిస్తే కోర్టులకు వెళ్లడం వంటివి చేస్తుంటారు. ఇలా ఇతడిపై భీమవరం, పాలకొల్లు నియోజకవర్గాల్లో తొమ్మిదికి పైగా కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువగా దాడులు, దౌర్జన్యాలు, స్థలవివాదాల కేసులుండటం అతని వ్యవహార శైలికి నిదర్శనం.

కొన్ని నెలల క్రితం తెలంగాణలో మత్స్యశాఖ చేపల పెంపకానికి సంబంధించి టెండర్లు ఆహ్వానించగా పాలకొల్లులో ఓ బ్యాంకుకు సంబంధించి నకిలీ ష్యూరిటీలు సిద్ధం చేసి జయప్రకాష్‌నాయుడు టెండర్లు వేశారు. ఇవి నకిలీ ష్యూరిటీలని తేలడంతో తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతుంది. అలాగే జయప్రకాష్‌నాయుడిపై భీమవరం వన్‌టౌన్, టూటౌన్, పాలకోడేరు, వీరవాసరం పోలీస్‌స్టేషన్లల్లో 9 కేసులకుగాను రెండు కేసులు పూర్తికాగా, మరో ఏడు కేసులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే 2014లో నకిలీ పత్రాలతో భవనం కబ్జాకి యత్నించారనే కేసు, వీరవాసరంలో ప్రభుత్వ భూమి కబ్జాకి యత్నాంచారని మరో కేసు, వీరవాసరంలో ఓ ఇంటి ప్రహరీ గోడ కూల్చి ఇంటి యజమానిపై దాడికి పాల్పడిన కేసులు ఉన్నాయి. మొత్తంగా జయప్రకాష్‌నాయుడి వ్యవహారం మరోసారి జనసేన శ్రేణుల్లో కలకలం రేపింది.

అరెస్ట్.. రిమాండ్

తణుకు: వ్యక్తిపై దాడి చేసి కిడ్నాప్‌నకు యత్నించిన ఘటనకు సంబంధించి వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడుతోపాటు మరికొందరిపై తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తణుకుకు చెందిన కొలువూరు శ్రీరామరెడ్డికి జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడుకి మధ్య గతం నుంచి ఘర్షణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 27న శ్రీరామరెడ్డి వద్ద గుమాస్తాగా పనిచేస్తున్న తణుకు పాతవూరుకు చెందిన నడిపూడి వెంకటశ్రీనివాస్‌ను స్థల వివాదంలో జయప్రకాష్‌నాయుడుతోపాటు మరికొందరు దాడి చేసి చంపుతానని బెదిరించారు. శ్రీనివాస్‌ను కారులో ఎక్కించుకుని కిడ్నాప్‌నకూ ప్రయత్నించారు. తన వద్ద సెల్‌ఫోన్, పర్సు లాక్కుని భయభ్రాంతులకు గురిచేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయప్రకాష్‌నాయుడుతోపాటు నవరపు నాగసుబ్రహ్మణ్యం, మద్దాల సత్యసాయి బాబా, గ్రంధి రత్నకిషోర్, కరీంశెట్టి వీరవెంకట సత్యనారాయణమూర్తి, జవ్వాది మావుళ్లు, కొల్లాటి జయకృష్ణ, జోడ నాగరాజు, దేవా సాయికృష్ణపై కేసు నమోదు చేసి పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగరాజు నిందితులకు వచ్చేనెల 11 వరకు రిమాండ్ విధిస్తూ తీరు చెప్పినట్టు సీఐ సత్యనారాయణ చెప్పారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన సులభం



యువకులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత లక్ష్య సాధనలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఏలూరు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. యువజన అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మరో అతిథి ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ దేశ సమైక్యతకు యువత పాటుపడాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని బుధవారం నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో నిర్వహించనున్నామన్నారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీ.గిరిబాబు మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నారు. విద్యార్థులు జీ20 దేశాల అధినేతల మాస్కులు ధరించి జీ20 సమ్మిట్ నమూనా సదస్సును ప్రదర్శించారు. అనంతరం యువతకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్‌రాజ్, జిల్లా ఉపాధి అధికారి మధుభూషన్‌రావు, సీఆర్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆకివీడు: రీ సర్వే ఆలస్యం కావడంపై కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. తరటావ గ్రామంలో రీ సర్వే ప్రాంతాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ, సర్వే అధికారులతో ఆమె మాట్లాడుతూ జగనన్న భూహక్కు–భూరక్షణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని గతంలో ఆదేశించినా సర్వే పనులు జాప్యం కావడం సరికాదన్నారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి, పనులను వేగవంతం చేయాలన్నారు. జిరాయితీ భూమిని పక్కాగా కొలవాలని, రికార్డులు సంపూర్ణంగా ఉండాలన్నారు. స్థానిక జాతీయ రహదారి పక్కన ఉన్న కార్తికేయ జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, లోపాలకు తావివొద్దని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ ఆమె వెంట ఉన్నారు.

కచ్చితత్వంతో రీ సర్వే

భీమవరం (ప్రకాశం చౌక్): వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలన్నింటినీ ఒకేసారి రీ సర్వే చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆకివీడు మండలంలో జరుగుతున్న రీ సర్వే అధికారులతో సమీక్షించారు. ఆకివీడు మండలం రీ సర్వే పనుల్లో వెనుకబడి ఉందని అసహనం వ్యక్తం చేశారు. సర్వే అధికారులు, టెక్నికల్ సిబ్బంది సమన్వయంతో సర్వే పనుల్లో ప్రగతి చూపాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, ఆకివీడు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వరం వైఎస్ఆర్ ఆసరా



మొగల్తూరులో ఆసరా వారోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మహిళలకు వరంగా వైఎస్ఆర్ ఆసరా పథకం నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మొగల్తూరులో జరిగిన ఆసరా వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని 580 గ్రూపులకు సంబంధించి రూ.6.74 కోట్ల ఆసరా చెక్కును అందించారు. ఈసందర్భంగా చీఫ్‌విప్ ముదునూరి మాట్లాడుతూ సీఎం జగన్ హామీ మేరకు ఇప్పటివరకూ మూడు విడతల్లో 75 శాతం డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేస్తోందన్నారు. దేశానికే పొదుపు సంఘాల మహిళలు ఆదర్శంగా నిలిచేలా సీఎం జగన్ సంకల్పించారన్నారు. గత ప్రభుత్వం కంటే మిన్నగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వీఓఏలకు నెలకు రూ.8 వేల వేతనం అందిస్తున్నామన్నారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఇటీవల ఎమ్మెల్సీగా గెలుపొందిన వంకా రవీంద్రనాథ్‌కు శాలువ కప్పి సన్మానం చేశారు. ఎంపీపీ అందే సూర్యావతి, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, సర్పంచ్‌లు పడవల మేరీ, తణుకుల మునేశ్వరరావు, లోకం నాని, బందెల ఏలీషా, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పాలా జ్యోతి, నాయకులు కర్రి ఏసుబాబు, గుబ్బల నారాయణమూర్తి, పాలా రాంబాబు, ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, ఏపీఎం సుభాషిణి పాల్గొన్నారు.

నేడు కిసాన్ మేళా

వ్యవసాయశాఖ మంత్రి రాక



మార్టేరు వరి పరిశోధనా స్థానం ముఖద్వారం

పెనుమంట్ర: మార్టేరు వరి పరిశోధనా స్థానంలో బుధవారం కిసాన్ మేళా నిర్వహించనున్నట్టు సంస్థ సహ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన నూతన వరి వంగడం, ఆధునిక యంత్రాలు, పనిముట్లు, ఇతర సాంకేతిక క్షేత్ర సందర్శన, రైతులు, శాస్త్రవేత్తల ముఖాముఖి తదితర కార్యక్రమాలను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

దెందులూరు: పోటీతత్వంతోనే విజయం సాధించాలనే పట్టుదల కలుగుతుందని జేఎన్‌టీయూ (కాకినాడ) రెక్టర్ కేవీ రమణ అన్నారు. వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరుగుతున్న సౌత్‌జోన్ పోటీలను తిలకించేందుకు మంగళవారం వచ్చారు. గుడ్లవల్లేరు కళాశాల జట్టుపై ఏలూరు కళాశాల జట్టు, విష్ణు కళాశాల జట్టుపై పీవీపీ సిద్ధార్థ కళాశాల జట్టు, సారథి కళాశాల జట్టుపై వాసవి ఇంజనీరింగ్ కళాశాల జట్టు, సెయింట్ మేరీస్ కళాశాల జట్టుపై సీఆర్‌ఆర్ కళాశాల జట్టు విజయం సాధించాయి. కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో అవినీతిపై నిలదీత

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడి సహకార పరపతి సంఘం (సొసైటీ)లో అవినీతి జరిగి ఏడాది గడిచినా సొసైటీ కార్యదర్శి, ఉద్యోగులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం బాదంపూడి సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ పాలకవర్గ వార్షిక జనసభ జరుగుతుండగా బాదంపూడి, వెల్లమిల్లి రైతులు అడ్డుకున్నారు. సొసైటీకి తాళం వేసి రిలే దీక్ష చేపట్టారు. గతేడాది సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు వడ్డీతో సహా బకాయిలు చెల్లించినా.. బ్యాంకు అధికారుల నుంచి నోటీసులు రావడంపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. 250 మంది రైతులకు చెందిన సుమారు రూ.2.60 కోట్లు సొసైటీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు స్వాహా చేశారనే విషయం బయటపడింది. ఈ మేరకు విచారణ జరిగినా, సొసైటీ కార్యదర్శి, ఉద్యోగులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని రైతులు మండిపడ్డారు. సొసైటీ అధ్యక్షుడు మల్లరెడ్డి శేషగిరి ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఉద్యోగులు ఇలా మోసం చేస్తారని అనుకోలేదన్నారు.

భానుడి భగభగలు

మార్చిలోనే మండుతోంది

- గతం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు
- వాతావరణ శాఖ హెచ్చరికలు
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- 'ఉపాధి' ప్రాంతాల్లో నీడ ఏర్పాట్లు
- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఉపాధి హామీ పథకం పనుల వద్ద ఏర్పాటుచేసిన టెంట్‌లో సేదతీరుతున్న కూలీలు

ఏలూరు(మెట్రో): సూర్యుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చిలోనే మాడు పగిలే ఎండలతో విజృంభిస్తున్నాడు. గతంలో మార్చిలో 32 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు ఉండేవి. ఈ ఏడాదిలో వారం రోజులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రానున్న ఏప్రిల్, మే నెలల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

మూడేళ్లతో పోలిస్తే.. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ ఇప్పటికే జిల్లా కలెక్టరేట్‌లకు హెచ్చరికలు జారీ చేసింది. జిల్లా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. సాధారణ ఉష్ణోగ్రతలు కంటే రోజుకు 3 నుంచి 4 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా.. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతి ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, నీటిపారుదల, డ్వామా, పంచాయతీ, జిల్లాపరిషత్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మూగజీవాలకు సైతం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని సూచించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని ఆదేశించారు.

'ఉపాధి' కూలీలకు.. ఎండ వేడితో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలు ఇబ్బంది పడకుండా చూడాలని ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాంబాబు ఆదేశించారు. ఉపాధి కూలీల సౌకర్యార్థం షేడ్ నెట్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు పనులు జరిగే ప్రాంతాల వద్ద అందుబాటులో ఉంచారు. ఉపాధి పనులను ఉదయాన్నే ప్రారంభించి ఎండ పెరిగే సమయానికి ముగించేలా, కూలీలు వడదెబ్బకు గురికాకుండా డ్వామా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తు హెచ్చరికలు

ఉపాధి కూలీలు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం ఉండటం, మత్తు, ఫిట్స్, అపస్మారక స్థితి ఇవన్నీ వడదెబ్బ లక్షణాలు కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి ప్రత్యేక సూచనలు జారీ చేశారు. బయట పనులకు, పొలం పనులకు వెళ్లేవారు ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రత్యేక చర్యలు



రాష్ట్ర వాతావరణ శాఖ ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని శాఖల అధికారులను సమాయాత్తం చేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తున్నాం. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. గతేడాది కంటే ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ సూచన మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

క్లుప్తంగా

తల్లి మృతికి కారకుడైన కుమారుడి అరెస్టు

ఆగిరిపల్లి: ఆస్తి పంచలేదనే కోపంతో తల్లిపైన దాడి చేసి ఆమె మృతికి కారణమైన కుమారుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై ఎస్.చంటిబాబు మంగళవారం తెలిపారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లికి చెందిన కందుల లక్ష్మిపై ఆస్తి తగాదాల విషయంలో పెద్ద కుమారుడు శివరామకృష్ణ దాడి చేశాడు. దీంతో మనస్థాపం చెందిన తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసు విచారణ పూర్తి చేసిన పోలీసులు శివరామకృష్ణను అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

8, 9 తేదీల్లో వక్తా ఉచిత శిక్షణ

ఏలూరు(మెట్రో): విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులలో ఆత్మ న్యూనతను పోగొట్టి, ఆత్మవిశ్వాసం నింపేందుకు స్టెప్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8, 9 తేదీల్లో వక్తా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్టెప్ నిర్వాహకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. విజయవాడ, ఉండవల్లి, రాజాగృహాలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణకు హాజరయ్యే సభ్యులకు వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 94405 39808, 9490789781లో సంప్రదించాలని కోరారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్టెప్ బాధ్యులు పాల్గొన్నారు.

కొబ్బరికి తెల్లదోమ పోటు

- దిగుబడి తగ్గే ప్రమాదం
- తెగులును అరికట్టేందుకు సదస్సులు


తెల్లదోమ తెగులు ఆశించిన కొబ్బరి తోట

సాక్షి, భీమవరం : జిల్లాలో వరిసాగు తరువాత ఎంతో ప్రాధాన్యత గల కొబ్బరిసాగుకు తెల్లదోమ ఆశించి రైతులు అవస్థలు పడుతున్నారు. సర్పిలాకార తెల్లదోమ కారణంగా బూజు తెగులు నల్లని మసిలా వృద్ధిచెంది కొబ్బరి ఆకులు నల్లగామారి దిగుబడి తగ్గే ప్రమాదముంది. వేసవిలో ఎక్కువగా ఈ తెగులు వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. తెల్లదోమ తెగులు నివారణకు జిల్లా వ్యాప్తంగా రైతులకు సదస్సులు నిర్వహించేందుకు ఉద్యానశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

37 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు

జిల్లా వ్యాప్తంగా 37 వేల ఎకరాల్లో ఉద్యాన సాగుచేస్తున్నారు. ఇందులో 20 వేల ఎకరాలకు పైగా కొబ్బరి సాగు ఉంది. పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు పెరటిదొడ్లు, పుంతగట్లు, రహదారుల వెంబడి కొబ్బరి సాగు చేస్తున్నారు. కొబ్బరికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉండడంతో అనేక మంది రైతులు తోటలను సైతం పెంచుతున్నారు. కొబ్బరి ధర ఎలా ఉన్నా దిగుబడి బాగుంటే చాలని రైతులు భావిస్తారు. అయితే తెల్లదోమ వంటి తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తెల్లదోమ లక్షణాలు

రసం పీల్చే జాతికి చెందిన తెల్లదోమను 2016 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో గుర్తించారు. తెల్లదోమ చిన్న, పెద్ద రెక్కల పురుగులు ఆకుల అడుగు భాగాల్లో చేరి రసాన్ని పీల్చుతాయి. ఆకుల అడుగు భాగంలో తెల్లటి దూదివంటి పదార్థం కనిపిస్తుంది. సర్పిలాకర తెల్లటి వలయాకారంలో గుడ్లు విసర్జించే తేనేలాంటి జిగురు పదార్థంపై కాప్నోయం జాతికి చెందిన బూజు తెగులు నల్లని మసిలా వృద్ధి చెందుతుంది. జిగురు పదార్థం కింది ఆకులపై పడి నల్లటి మనిమంగుతో కిరణ జన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి ఆహారం తయారుచేసుకునే శక్తి సన్నగిల్లుతుంది. దీంతో కొబ్బరి దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ పద్ధతులు

తెల్లదోమ ఆశించిన కొబ్బరితోటల్లో పురుగు మందులు పిచికారీ చేయకూడదు. తద్వారా సహజ శత్రువులైన పరాన్నజీవులు వృద్ధిచెంది తెల్లదోమలను నియంత్రిస్తాయి. పురుగుస్థాయి ఎక్కువగా ఉంటే అజాడిరక్టిన్ 10 వేల పీపీఎం మిల్లీలీటర్లను లీటరు నీరు లేదా ఐదు మిల్లీలీటర్ల వేప నూనె, రెండు గ్రాముల సర్ఫ్ కలిసి ఆకు అడుగు భాగం పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు ఉపయోగపడే పురుగులను ఉద్యానశాఖ సరఫరా చేస్తోంది. 200 పురుగులుండే డబ్బాను కేవలం రూ.40కు అందిస్తుంది. ఈ డబ్బాలు ఎకరాకు ఆరు డబ్బాలను కట్టాల్సి ఉంటుంది.

ప్రత్యేక శ్రద్ధతో తెగులు నివారణ



కొబ్బరిపై ఆశించే తెల్లదోమ నివారణకు రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే యలమంచిలిలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో అవగాహన కల్పించాం. తెల్లదోమ నివారణ పురుగులు అంబాజీపేటలో లభిస్తాయి. వాటిని రైతులు నేరుగా లేదా ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చు. తెల్లదోమ వేసవిలో ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. రైతులు ప్రత్యేక శ్రద్ధతో నివారణ చర్యలు చేపట్టాలి.

– ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానశాఖాధికారి, భీమవరం

గేట్‌లో మెరిసిన ఏపీ నిట్ విద్యార్థులు


గేట్‌లో మెరిసిన ఏపీ నిట్ విద్యార్థులతో డీన్ అకడమిక్ కురుమయ్య తదితరులు

తాడేపల్లిగూడెం: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో ఏపీ నిట్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో మెరిశారు. జాతీయ స్థాయిలో వీరు మంచి ర్యాంకులు సాధించారని నిట్ డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య మంగళవారం తెలిపారు. సంస్థలో ఆఖరి సంవత్సరం చదువుతోన్న బొలిశెట్టి మణికంఠ సివిల్ ఇంజినీరింగ్‌లో రెండో ర్యాంకు, డి.సాయివెంకట్ బయోటెక్నాలజీలో 13వ ర్యాంకు, ఓరుగంటి రోహిత్ ఈసీఈలో 21వ ర్యాంకు, లుబుహిత్ బీషేన్ సివిల్‌లో 83వ ర్యాంకు, రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి బయోటెక్నాలజీలో 93వ ర్యాంకు సాధించారు. మొత్తం 100 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వీరిలో 100లోపు ర్యాంకులు ఐదుగురు, 1000లోపు ర్యాంకులు 20 మంది పొందారు. విభాగాల వారీగా బయోటెక్నాలజీలో ఎనిమిది, సివిల్‌లో 20, సీఎస్‌ఈలో 08, ఈఈఈలో 16, ఈసీఈలో 20, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 10, కెమికల్ ఇంజినీరింగ్‌లో 09, ఎంఎంఈలో తొమ్మిది ర్యాంకులు పొందారు. వీరిని ఉద్దేశించి డీన్ అకడమిక్ కురుమయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఆచార్యులతో నాణ్యమైన, ఉత్తమమైన విద్యాబోధనను అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల్లో కొలువులు సాధించడంతో పాటు, దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ ర్యాంకులు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ డాక్టర్ వినోత్‌కుమార్‌రాజా మాట్లాడుతూ సంస్థలో 2018 నుంచి ఏటా ఉచిత గేట్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్‌పడోలే, రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అభినందించారు.


రొయ్యల సాగులో యాంటీబయోటిక్స్ వాడొద్దు




రొయ్య రైతుల అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న నస్తా సీఈఓ దిలిత్ ఎక్కా

ఆకివీడు: రొయ్యల సాగులో యాంటీబయోటిక్స్ వాడకాన్ని నిషేధించాలని ఎంపెడా అధికారులు అన్నారు. స్థానిక ఫిషరీస్ కార్యాలయంలో ఎంపెడా ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నస్తా సీఈఓ దిలిత్ ఎక్కా, కేవీకే శాస్త్రవేత్తలు నిరజ తదితరులు మాట్లాడుతూ రొయ్యల సాగులో యజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నాణ్యమైన మందులు వాడటం ద్వారా విదేశీ మార్కెట్‌లో మన రొయ్యలకు గిరాకీ పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం నాలుగో స్థానంలో మన ఎగుమతులు ఉన్నాయన్నారు. రొయ్యల సాగు నష్టాలను అధిగమించేందుకు నాణ్యమైన సీడు, ఫీడు వాడాలని సూచించారు. రొయ్యలకు ప్రత్యామ్నాయ సాగుగా జీప్టీ థిలాఫియా, పండుగొప్ప, కొరమేనే వంటి ఇతరత్రా సాగును చేపట్టాలన్నారు. వీటి హేచరీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.


మాయాబజార్ నాటకంలో కీలక సన్నివేశం


ఘటోత్కచుని సాక్షాత్కారం


ఓ చందమామా, నా చందమామా


అభిమన్యు శశిరేఖల విహారం

సురభి కళా సౌరభ గుబాళింపు

- అద్భుత దృశ్యంగా మాయాబజార్
- మంత్రముగ్ధులైన ఆహూతులు

తాడేపల్లిగూడెం : హాయ్.. హాయ్ నాయకా అంటూ మిన్నంటిన జయజయధ్వానాలు.. ఒక్కసారిగా కమ్ముకున్న పొగమేఘాలు వాటి మధ్య నుంచి నమోజనని, నమో మాత నమో నమో నామస్మరణతో ప్రత్యక్షమయ్యే ఘటోత్కచుడు. నాటకం చూస్తున్న ప్రేక్షకుల మోముల్లో ఒకింత ఆశ్చర్యం. ఆ వెంటనే సంబరం. ఇలా విజువల్ వండర్‌గా ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి బీవీఆర్ కళాకేంద్రంలో ప్రదర్శించిన వరంగల్ సాయిసం తోషి (సురభి) నాట్యమండలి వారి మాయాబజార్ నాటకం ఆకట్టుకుంది. మనోహర దృశ్యకావ్యాన్ని అద్భుతంగా వేదికపై ఆవిష్కరింపజేయడంలో సురభి సారథుల గుబాళింపు అచ్చెరువొందేలా చేసింది. ఈ నాటకాన్ని మూడు గంటల పాటు సినిమాటిక్స్‌ను మైమరపించేలా రక్తికట్టించారు. నిద్రావస్థ నుంచి మేల్కొనేవేళ ఘటోత్కచుని రాకను సూచించే సమయంలో వేదికపై డ్రాగన్ నోటి నుంచి మంటలను తీసుకొచ్చారు. అభిమన్యు, శశిరేఖ ప్రేమకేళీ విలాసాలలో నీరుచిమ్మే పొంటేన్‌ను వేదికపై పెట్టి ఔరా అనిపించారు. ఓ చందమామా, నా చందమామా అంటూ విరహవేదనతో శశిరేఖ, అభిమన్యులు పడే ఆత్రుతకు లైటింగ్‌తో దృశ్యరూపం ఇచ్చారు. సంధ్యావందన వేళ పండులాంటి సూర్యుని ప్రేక్షకులు చూసిన భ్రాంతిని పొందారు. అభిమన్యు, ఘటోత్కచుని యుద్ధంలో బాణం, గదా యుద్ధం, మంటలు, వాటిని ఆర్పే వానను వేదికపైనే చూపించారు. ప్రేమవిహార రథాన్ని, నారదుని ఆకాశయానాన్ని ఆవిష్కరింపజేశారు. శశిరేఖ నిదిరిస్తున్న మంచం గాలిలో మాయం చేసి శహభాష్ అనిపించారు. ప్రతి సీనునూ పండించడంలో కళాకారులు పోటీ పడ్డారు. అలనాటి మేటి చిత్రరాజం మాయాబజార్ సినిమాను చూస్తున్నామా అనే భ్రాంతిని కలిగించారు. అలాగే.. గిటార్, ఫ్లూట్ వాయిద్య విన్యాసం, పీటీ వి.కృష్ణమాధురి గాన మాధుర్యం, ఏపీ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు, జానపద చక్రవర్తి బిరుదాంకితులు ఎల్ఆర్ కృష్ణబాబు జానపద జావళీలు అలరించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక పరిషత్‌ల అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తదితరులు బీవీఆర్ కళాకేంద్రం సభ్యులు పాల్గొన్నారు.


కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బుద్దాల రామారావు

రిజర్వేషన్లు అడ్డుకోవడానికి బీజేపీ కుట్ర


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పాలకొల్లు అర్బన్: దళిత క్రైస్తవుల రిజర్వేషన్లను అడ్డుకోవడానికి బీజేపీ కుట్ర పన్నుతోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఆమోదించకూడదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం గవర్నర్‌ని కలిసి వినతిపత్రం అందజేయడం పట్ల పాలకొల్లు నియోజకవర్గంలోని దళిత క్రైస్తవులు, పాస్టర్లు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆధ్వర్యంలో పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగంలో బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ మత స్వేచ్ఛ కల్పించారని, మతం మారితే కులం రిజర్వేషన్ మారదని చెప్పారు. పున్నయ్య, రంగనాథ్ కమిషన్లు సిఫార్సు చేసినా కేంద్రం రిజర్వేషన్లు అమలు చేయకుండా తాత్సారం చేసిందని ఆరోపించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో ఎస్సీ కమిషన్ కూడా అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుందన్నారు. పెరిగిన జనాభా ఆధారంగా దళిత క్రైస్తవులకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ దళితులను అణచివేయడానికి కుట్ర పన్నుతోందని, దీనికి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ద్వారా రాష్ట్రంలో మత విద్వేశాలను సృష్టిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, ఖండవల్లి వాసు, పీటర్‌సన్ చిన్నా, దేవ రాజేష్, రామాంజుల పెదమధు, పొనుకుమట్ల వీరాస్వామి, బళ్ల రాజశేఖర్, రాపాక సునిబాబు, నల్లి నాగరాజు, పాస్టర్లు పాల్గొన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై ఉంగుటూరు టోలు ప్లాజా సమీపంలో నాచుగుంట టన్నెలు రెయిలింగ్‌ను ఏలూరు వైపు వెళుతున్న చిన్న కారు మంగళవారం సాయంత్రం ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న కొవ్వూరుకు చెందిన శనక్కాయల విశ్వేశ్వరరావు (76), శనక్కాయల రత్నమాల (74), చీమకుర్తి యామినిదేవి (56), చీమకుర్తి దివ్యశ్రీ (29)లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో మహిళ కారు నడుపుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ముద్దాపురంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- తలభాగం తొలగించిన దుండగులు
- దళిత సంఘాల ఆందోళన


ముద్దాపురం పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం తలభాగం తొలగించిన దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలోని పాఠశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం తల భాగాన్ని మంగళవారం తెల్లవారుజామున దుండగులు తొలగించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ అభిమానులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు తెల్లవారే సరికి పాఠశాలకు చేరుకున్నారు. దీంతో గ్రామంలో ఆందోళన వాతావరణం ఏర్పడింది.

క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ల రంగ ప్రవేశం

నిందితులను గుర్తించేందుకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్లు రంగ ప్రవేశం చేశాయి. అంబేడ్కర్ విగ్రహం, పక్కనే ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలపై ఉన్న వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్లు అంబేడ్కర్ విగ్రహం నుంచి పక్కనే ఉన్న చెరువు చుట్టూ తిరిగి మళ్లీ పాఠశాల వద్దకే పోలీస్ జాగిలం వచ్చింది.

నిందితులను శిక్షిస్తాం

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. నిందితులు ఎంతటి వారైనా పట్టుకుంటామని, చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ చెప్పారు. నరసాపురం డీఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో తణుకు సీఐలు సీహెచ్ ఆంజనేయులు, ముత్యాల సత్యనారాయణ, ఎస్సైలు తదితరులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ఐదుగురు అనుమానితులను గుర్తించామని, పూర్తి వివరాలు రాబట్టి కేసును ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.

దళిత సంఘాల ఆందోళన

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్ట్ చేసిన కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం ముద్దాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. సాయంత్రం దువ్వ జాతీయ రహదారిపై రాస్తారోకో, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని వివిధ దళిత అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఘటనా స్థలిని ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, రైతు విభాగం మండల అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు తుమ్మగంటి సత్యనారాయణ, సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీటీసీ సభ్యులు సందర్శించారు. దళిత సంఘాల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం ముద్దాపురం పాఠశాల ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తల భాగం తొలగించడం దారుణమని, నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించడం ద్వారా లబ్ధిపొందాలని కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాని మంత్రి ఆరోపించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం వెనుక ఉన్న వారెవరైనా ఉపేక్షించబోమని అన్నారు. తణుకు నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరని, ముద్దాపురం వంటి పచ్చని పల్లెటూరులో కుల విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని మంత్రి కారుమూరి పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

ముసునూరు: మహిళ అనుమానాస్పద మృతి మండలంలోని కలకలం సృష్టించింది. భార్య ఉరి వేసుకుందని భర్త చెబుతుండగా.. ఆమెది హత్యేనని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ముసునూరు మండలం బలివేకు చెందిన కడవకొల్లు మారేష్‌కి బాపులపాడు మండలం ఓగిరాలకు చెందిన చుక్కమ్మ (24)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్లు, ఐదు నెలలు వయసు గల ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండో పాపకు బుధవారం అన్న ప్రాసన చేయాలని నిర్ణయించుకున్నారు. కాగా మంగళవారం ఆటో తోలకానికి వెళ్లిన మారేష్ మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మారేష్ కిరాయి డబ్బులు భార్యకిచ్చి ఆటో వేసుకుని వెళ్లి పోయాడు. సాయంత్రం అతను ఇంటికి తిరిగి వచ్చే సరికి భార్య చుక్కమ్మ ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెంది ఉంది. ఐతే చుక్కమ్మ బంధువులు ఆమెది హత్య అని ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ దాసరి సుధ, రెవెన్యూ అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కుటుంబరావు మారేష్‌ను అదుపులోనికి తీసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించనున్నట్టు ఎస్సై తెలిపారు.

సంపూర్ణ పోషణ.. ఆరోగ్యంపై సంరక్షణ


సంపూర్ణ పోషణ పక్వాడాపై సిబ్బందితో అవగాహన, మిల్లెట్స్‌ల ప్రదర్శన


సంపూర్ణ పోషణపై గ్రామాల్లో ర్యాలీలు

- పోషకాహార ఆవశ్యకతపై అవగాహన
- వచ్చే నెల 3 వరకు పోషణ పక్షోత్సవాలు

పెంటపాడు: ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. వైద్య, ఆరోగ్యశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖల ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణతో పాటు, వారికి పోషకాహారం అందిస్తోంది. అందుకు ప్రత్యేకంగా రూ. వేల కోట్లు వెచ్చిస్తోంది. చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఆరోగ్య సంరక్షణకు పలు పథకాలు అమలు చేస్తోంది. సంపూర్ణ పోషణ... ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం ద్వారా లక్ష్యసాధనకు పోషకాహారం అందరికీ అందేలా చూద్దాం... ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం కలిసికట్టుగా పనిచేద్దాం. అనే నినాదాలతో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3 వరకు పక్షోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీనిలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోల ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, గ్రామాల్లోనూ పోషణపై అవగాహన పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా.....

ఈనెల 20 నుంచి పోషణ అవగాహన కార్యక్రమాలు ప్రారంభం కాగా శనివారం వరకూ పోషణ విలువలు, పోషకాహార నిపుణులు, సెన్స్‌లెక్చరర్ల ద్వారా ఆహారంలో మిల్లెట్లను చేర్చడం, వాటివలన కలిగే ప్రయోజనాలపై అవగాహన, పోషకాహార మేళాలు, గర్భిణులు, కౌమారదశలో బాలికలు, పిల్లలకు ఇమ్యూనిటీ ఆధారిత ఈవెంట్స్‌ల నిర్వహణ, 6 సంవత్సరాలు కంటే ఎక్కువ మంది వయస్సు ఉన్న పిల్లల ఎత్తు, బరువు కొలవడం, పోషకాహార లోపం ఉన్న పిల్లలందరినీ గుర్తించడం, పోషణ్ ట్రాక్టర్ అప్లికేషన్‌లో నమోదు, వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 27న మిల్లెట్‌ల ఆధారిత అవగాహన కార్యక్రమంలో భాగంగా పోషకాహార లోపాన్ని నిర్మూలించడం ప్రత్యేక దృష్టి సారించడం, పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ, యుక్త వయస్సులో ఉన్న బాలికలకు రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యతపై సెమినార్‌లు నిర్వహణ, ఈనెల 29న డైట్ కన్సలేషన్ క్యాంప్‌లో భాగంగా గర్భిణులు పాలిచ్చే తల్లుల కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, డీహెచ్‌సీల వద్ద పోషకాహారంపై అవగాహన, 30న వంట పోటీల్లో భాగంగా మిల్లెట్ ఆధారిత సంప్రదాయ వంటల పోటీలు నిర్వహిస్తారు. 31న ఏఎన్‌ఎం, ఆశ, హెల్త్ సబ్ కమిటీలు ఉమ్మడి గృహ సందర్శనలు, ద్వారా పల్లెల్లో హైరిస్కు ఎనీమియాపై ప్రత్యేక దృష్టితో పరిశీలించడం, గర్భిణీలు, బాలింతలను 7 నెలల నుంచి 24 నెలల పిల్లల వరకు సందర్శనలు అనుసరించడం, ఏప్రిల్ 1న రోజువారీ సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పిండం, న్యూట్రీగార్డెన్‌లకు ఎక్స్‌పోజర్ సందర్శన నిర్వహించడం మిల్లెట్ ఆధారిత వ్యవసాయం ద్వారా సామాజిక, ఆర్థిక విలువల సృష్టిపై రైతులకు శిక్షణ, 3న ముగింపు వేడుకల్లో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏడబ్ల్యూసీలో హెల్త్‌బేబీ షో నిర్వహణ, అన్ని పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు.

చురుగ్గా పక్షోత్సవాలు



ప్రజలందరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి. ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహార పక్షోత్సవాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో చురుగ్గా, ఉత్సాహంగా కార్యక్రమాలు సాగుతున్నారు. షెడ్యూల్ ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకొన్నాం. దానిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– సీడీపీవో టీఎల్. సరస్వతి

క్లుప్తంగా

కేంద్రం విధానాలతో సంక్షోభం


మారంపల్లి గ్రామంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదిన నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మారంపల్లి గ్రామంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ 12 డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజల మద్దతు ఈ కార్యక్రమానికి అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో కె.ఈశ్వర్, డి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి

స్వామి **తాడేపల్లిగూడెం (టీఓసీ):** చైత్రమాసం సప్తమి మంగళవారం పురస్కరించుకొని వాసవి పంచాయతన క్షేత్రంలో సూర్యనారాయణ స్వామికి పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజలను ఆర్య వైశ్య సంఘం సభ్యులు నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్య, కె.శ్యామ్, ఎ.కృష్ణకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

180 పశువులకు ఎఫ్ఎండీ టీకాలు


పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఎమ్పీటీసీ నార్ని శంకర్ మాట్లాడుతూ రైతులు తమ పాడి పశువులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. తద్వారా పాడి పశువులను సంరక్షించుకోవచ్చన్నారు. అనంతరం పశువైద్యాధికారిణి డాక్టర్ టి.దివ్యశ్రీ 180 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు పెంటపాడులో ఆసరా చెక్కుల పంపిణీ


ఆసరా సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

పెంటపాడు: వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు 3వ విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హైమావతి తెలిపారు.ఈ సందర్భంగా పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూలో నిర్వహించబోయే సభ ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా హాజరై మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రవీణ, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం వై. లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేతలి ఆశీలు వేలం రూ. 2.21 లక్షలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయతీలో రోజు వారి మార్కెట్ ఆశీలు రికార్డు స్థాయికి చేరింది. మంగళవారం తేతలి పంచాయతీలో నిర్వహించిన 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో రోజు వారి మార్కెట్ ఆశీలు వసూలుకు సంబంధించిన వేలంలో గ్రామానికి చెందిన సరెళ్ల వీరతాత రూ. 2లక్షల 21 వేలకు పాడుకున్నట్లు గ్రామ కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు తెలిపారు. గత సంవత్సరం కంటే రూ. 24 వేలు అధికంగా వేలం జరిగినట్లు తెలిపారు. ఈ వేలంను గరిష్ఠంగా రూ. 2లక్షల 20 వేలుగా డివిజనల్ పంచాయతీ అధికారి నిర్ధారించినట్లు తెలిపారు.

చురుగ్గా నేత్రాలమ్మ చెరువు పనులు

పెంటపాడు: దర్శిపర్రు గ్రామంలో ఎంతో కాలం నుంచి నిరుపయోగంగా ఉన్న నేత్రాలమ్మ ఆలయం వద్ద ఉన్న నేత్రాలమ్మ చెరువుగా పిలిచే రెండో తాగునీటి చెరువు అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చేందుకు వేసవిలో కాలువలు కట్టేలోపు ఈ చెరువును గ్రామ ప్రజలకు వినియోగంలోకి తెచ్చేలా తీవ్ర కృషి చేస్తున్నట్లు సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు తెలిపారు. గుడి పక్కగా వాకింగ్ ట్రాక్‌తో పాటు, అవుట్‌లెట్ సమస్యలను తీర్చేలా మండల అధికారుల సాయంతో మార్కింగ్ వేయించి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ డీ సుష్మాదేవి తెలిపారు. మండపాక గ్రామంలో సోమ, మంగళ వారాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరంలో గ్రామంలోని 435 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. వచ్చే నెల 24వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ, పశువైద్య సిబ్బంది షోలాపురి శ్రీను, అఖిల్ బాబు, ఎస్తేరు రాణి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కెమిస్ట్రీ–1, కామర్స్–1, సోషియాలజీ–1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్–1లు పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,478మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,389 మంది పరీక్షలు రాశారు. 89 మంది పరీక్షలకు హాజరు కాలేదు. నేటితో ఫస్ట్ ఇంటర్ పరీక్షలు ముగిసాయి.

తేతలిలో శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం


శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైన తేతలి సతీరామస్వామి ఆలయం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సతీరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. తేతలి గ్రామంలోని సీతారామ స్వామి ఆలయానికి సుమారు 400 సంవత్సరాల చరిత్ర వుందని ఆలయ సిబ్బంది తెలిపారు. తేతలి గ్రామానికి చెందిన తేతలి పట్టాభిరామయ్య సీతారామస్వామి వారికి అత్యంత భక్తిపరుడు. ఆయన రాసిన రామ కోటిని భద్రాచలంలోని శ్రీరాముల వారికి సమర్పించాలని సంకల్పించి బయలుదేరి వెళ్లగా మార్గ మధ్యంలో ఆనాటి హేలాపురి (ఏలూరు) సమీపంలోని విజయరాయి శివారులో ఒక వట వృక్షము మజిలీ చేయగా అక్కడ ఆంజనేయ సహిత చతుర్భుజ శ్రీ సీతారాముల వారి విగ్రహం దొరికింది. దానిని తన భద్రాచల యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో తన స్వగ్రామం తేతలి తీసుకు వెళ్లాలని బావించి ఆవిగ్రహాన్ని అక్కడే చెట్టు తొర్రలో భద్రపర్చగా ఆయన తిరుగు ప్రయాణంలో వచ్చి చూసే సరికి విగ్రహం లేకపోవడంతో దిగులు చెందిన పట్టాభిరామయ్య విచారిస్తూ ఉండగా ఆగ్రామంలోని ఒక ఆచార్యుని ఇంటి వద్ద ఉన్నట్లు ఆచూకీ తెలుసుకుని తనకు కలిగిన దర్శనం గురించి వివరించగా ఆగ్రామంలోని పెద్దల సమక్షంలో ఆంజనేయ సహిత చతుర్భుజ సీతారామస్వామి వారి విగ్రహాన్ని తేతలి గ్రామానికి తీసుకువచ్చి ప్రతిష్ట చేసినట్లు ఆధారాలు వున్నాయి. దీనితో అప్పటి నుంచి సుమారు 300 ఏళ్లుగా తేతలి గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరుకుంటున్నారు. ఈ ఆలయంలో శ్రీరాములు వారు భద్రాచలంలోని శ్రీరాముని మాదిరిగానే మీసాలతో దర్శనమిస్తారు. శ్రీరాముల విగ్రహం మీసాలుతో దర్శనమివ్వడం భద్రాచలంలో తర్వాత తేతలి ఆలయంలోనే అలా కన్పిస్తారని అర్చకులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ తీర్మానంపై హర్షం


సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న జేబీయు సంఘ సభ్యులు

పెంటపాడు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు వీలుగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం పట్ల జీసెస్ బిలీవర్స్ యూనియన్(జెబీయు) సంఘ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గూడెం టీచర్సు కాలనీలోని మార్టిన్ లూథర్ విగ్రహం వద్ద నివాళ్లలర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జేబీయు సంఘ అధ్యక్షుడు మానుకొండ డల్లా మాట్లాడుతూ జగనన్న తీసుకొన్న ఈ నిర్ణయం సాహసోపేతమన్నారు. కేంద్రం అనుమతి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మానుకొండ భాస్కరరావు, పి.రాజబాబు, మండా రాజసాగర్, దర్శి ప్రదీప్‌రాజా, చొల్ల జగదీష్, పి. సునీల్, మిత్ర, పాస్టర్లు స్టీఫెన్‌పాల్, ప్రేమ్‌కుమార్, దీవెనరావు, సుశీ జాషువారాణి, విజయ, శారద, జ్యోతి, హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు వీలుగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం పట్ల పశ్చిమ గోదావరి జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రొక్కాల నాగ బుజ్జి హర్షం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అసోసియేషన్ తరుపున కృతజ్ఞతలు వెల్లడించారు. హర్షం ప్రకటించిన వారిలో జిల్లా సెక్రటరీ ఉప్పుల దేవదాస్, నాయకులు అడపా దయరాజు, మద్దాల డేవిడ్ రాజు, నేలపాటి సాల్మన్‌రాజు, కర్రి జోసెఫ్, మధుకుమార్, స్టీఫెన్, జాన్‌మిల్టన్, జాన్‌బాబు, సామ్యూల్‌రాజు, ఏసురత్నం, సువర్ణరాజు, ఆశీర్వాదం సంతోషం వ్యక్తం చేశారు.

గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి


పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుమబోయిన కృష్ణప్రసాద్, తదితరులు

పెంటపాడు: పశువులలో పాల దిగుబడి తగ్గుతూ సాధారణంగా ఈ సీజన్‌లో వచ్చే గాలికుంటు వ్యాధిపై మండల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జట్లపాలెం పశువుల ఆసుపత్రి వద్ద వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధినివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణప్రసాద్ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెటర్నరీ సహాయకురాలు చాట్రాతి మౌనిక, సిబ్బంది కలిసి పలు పశువులకు టీకాలవేసారు. వైద్యశాల దాతలు జీవీఎస్ ప్రసాద్, పరమానంద చౌదరి, వైద్య సహాకులు జి. ప్రసాద్, వి. మణికంఠ, పి. శ్రీధర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కమలాకర్‌కు అభినందన సత్కారం


వాకర్స్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కమలాకర్‌కు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఔత్సాహిక క్రీడాకారులకు ఫుట్ బాల్‌లో శిక్షణ ఇస్తూ స్ఫూర్తి నింపుతున్న కానిస్టేబుల్ కమలాకర్‌కు మంగళవారం తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ చలం నేతృత్వంలో ప్రోత్సాహక పూర్వక అభినందన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, యోహాన్, సారధి, వాకర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తణుకులో శ్రీరామనవమికి శోభాయాత్ర


తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అఘోరా అఖాడా

తణుకు అర్బన్: శ్రీరామనవమి రోజున తణుకులో నిర్వహిస్తున్న శోభాయాత్రకు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాల్గొనాలని అఘోరా అఖాడా ఉత్తరాధికారి రాజేష్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించే మోటారు సైకిల్ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. జల్లూరి జగదీష్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు పైడిపర్రు శివాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్, మునిసిపల్ కార్యాలయం, సుభాష్‌చంద్రబోస్ రోడ్డు, రాజీవ్ చౌక్ సెంటర్ నుంచి ఈ శోభాయాత్ర నరేంద్ర సెంటర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడేటి సాయిరాం, భూపతిరాజు సుబ్బరాజు, వాసుదేవ వసంతరాయుడు, బెజవాడ సూరి, కరుటూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం


లలిత సహస్రనామ పారాయణ చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం లలిత సహస్రనామ పారాయణ, శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణ నిర్వహించారు. గాయత్రీ దేవి భక్త సమాజం భక్తులచే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ తెలిపారు. ముత్యాలమ్మవారి వెండి చీరకు తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన రెడ్డి నరసంహారావు – వెంకటలక్ష్మి దంపతులు అరకిలో వెండిని సమర్పించారు. ఈ సందర్భంగా దాతల పేరున అమ్మవారికి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరామప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


గరగపర్రు రోడ్డులో ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గరగపర్రురోడ్డులో విజయలక్ష్మి థియేటర్‌సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణల ఇళ్లను మంగళవారం మునిసిపల్ అధికారులు తొలగించా రు. భీమవరం పట్టణ అభివృద్ధిలో భాగంగా తాడేపల్లిగూడెం రోడ్డులో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో 67ఇళ్లను తొలగించా రు. అందులో 47 మందికి ఇప్పటికే ఇళ్లపట్టాల ను ఇవ్వడం జరిగిందని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలమేరకు ఇళ్ల తొలగింపు చేసిన వారికి టిడ్కో ఫ్లాట్లలో ఆశ్రయం కల్పించడం జరిగిందని ఏసిపి గౌరు తెలిపారు.

ఎరువుల గోదాముల్లో తనిఖీలు


మోదుగ గుంట గ్రామంలోని ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలంలోని హోల్‌సేల్, రిటైల్ ఎరువుల గోదాములను మంగళవారం ఆకివీడు ఏడీఏ కె.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. తాడేపల్లిగూడెం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో జంబ్లింగ్ తనిఖీల్లో ఈ భాగంగా తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట, పెంటపాడు మండలం ప్రత్తిపాడు మార్క్‌ఫెడ్ గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా మోదుగ గుంట గ్రామంలోరి రిటైల్ షాపులో రికార్డుల్లోని నిల్వలకు, గోదాముల్లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం రావడంతో నాలుగు లక్షల 70వేలు విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. సరైన పత్రాలను ఈ నెల 31వతేది లోపుగా సమర్పించాలని, లేకుంటే 6ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్బీకే ఇన్‌చార్జ్ జాలపర్తి సతీష్ ఉన్నారు.

దివ్యాంగుల విద్యకు సహకరించాలి


భవిత సెంటర్‌లో వార్షికోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి, స్నాక్స్ అందజేశారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల విద్యకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన వాకర్స్ మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా వాకర్స్ సభ్యులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు రైతులకు ఎంతో ఉపయోగం


కె. పెంటపాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగానికి పూజలు చేస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు, తదితరులు

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం రైతులకు ఎంతో ఉపయోగమని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. జగనన్నభూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ద్వారా కె. పెంటపాడు గ్రామంలో సర్వే చేసేందుకు గాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని మంగళవారం ఆయన మండల సర్వేయర్ దీప్తితో కలసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 1572 ఎకరాలకు గానూ 1232 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా భూహక్కు పత్రాలకు ఇచ్చేందుకు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు గాను ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. సరిహద్దు, పొలంగట్లు తదితర తగాదాలు ఇక ఉండబోవన్నారు. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విధానం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఎఫ్ఎంబీ నెంబర్లు పట్టా ఇచ్చేందుకు ఉపయోగమన్నారు. రైతుల సమస్యలు ఈ సర్వే ద్వారా తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ దీప్తి లాస్య, సర్పంచ్ పీతల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, మల్లెల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గోకా వెంకటేశ్వరరావు, వీఆర్వో రామచంద్రరావు ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.